# క్రిస్టడెల్ఫియన్స్ (Christadelphians)

(క్రీస్తునందు సహోదర-సహోదరీలు)

## బైబులును ఆధారముచేసుకొని స్థాపించబడిన సంఘము పరిచయము

**(Introducing a Bible-based Community)**

రాబ్ హైన్డ్‌మెన్ **(by Rob Hyndman)**

క్రిస్టడెల్ఫియన్స్ అనువారు మతపరమైన ఒక చిన్న సంఘము, వారు క్రొత్త నిబంధన కాలములోని మొదటి శతాబ్దపు సంఘముయొక్క నమ్మకములను మరియు విశేషగుణములను అలవర్చుకొనినవారు.

"క్రిస్టడెల్ఫియన్స్" అను పేరు సుమారు 150 సంవత్సరములుగా వాడుకలో ఉన్నది. 'క్రీస్తునందు సహోదర – సహోదరీలు' అను భావమునిచ్చు రెండు గ్రీకు పదములనుండి గ్రహింపబడినది.

(మత్తయి 23:8; కొలస్సీ 1:2 మరియు హెబ్రీ 2:11).

మేము ప్రపంచమునందలి 120 దేశములలో వ్యాపించి, మరి ముఖ్యముగా యునైటెడ్ కింగ్‌డమ్ (ఇంగ్లాండ్), ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్, దక్షిణ అమెరికా, భారత దేశము, ఆసియా మరియు ఆఫ్రికా దేశములలో అధిక సంఖ్యాకులమై యున్నాము. ఆదిమ క్రైస్తవులవలెనే మేమును ఇండ్లలోను, అద్దెగదులలోను కొన్ని మార్లు మా సొంత సభా వేదికలలోను కూడుకొందుము.

(అపో.కా. 1:13-14; 2:46-47, 18:7; 19:9, 28:30).

మేము మొదటి శతాబ్దపు క్రైస్తవత్వమును మాదిరిగా వెంబడించు వారమైయున్నాము. ప్రతి ఒక్క సంఘము "ఎక్లీషియా" అని పిలువబడును. (చర్చి అనుటకు క్రొత్తనిబంధన గ్రీకు పదము). మాలో వేతనములు చెల్లింపబడు పాదిరులు కాని, పాదిరి యొక్క అధికారములో ఉండు సంఘములుకాని ఉండవు. సభ్యులందరును సహోదరుడని కాని లేక సహోదరి అని కాని సంబోధింపబడి, సంఘముయొక్క కార్యకలాపములలో అందరును పాత్రధారులగుదురు. సభ్యులందరును దేవుని సేవకు స్వచ్ఛందముగా వారి సమయమును, సాధనములను మరియు శక్తినీ వెచ్చించెదరు. బలమైన కొన్ని నమ్మకములు మా సహోదరత్వమును ఒకటిగా దృఢపరచుచున్నవి.

(రోమా 12:4-8; 1 కొరింథీ 12:14-27; గలతీ 3:28).

బైబులు ప్రేరేపింపబడి వ్రాయబడిన దేవుని వాక్యమని మా విశ్వాసము కనుక బైబులునే మా మార్గదర్శిగా స్వీకరింతుము. మా వంటి నమ్మకములే కలిగిన వారికి బాప్తిస్మము (నీళ్ళలోనికి పూర్తిగా ముంచబడి) తరువాత సభ్యత్వము ఇవ్వబడును.

## క్లుప్తమైన చరిత్ర

**A Brief History**

అపొస్తలులనుండి అనేకులైన విశ్వాసులు క్రిస్టడెల్ఫియనుల వంటి నమ్మకములనే కలిగియున్నారు. ప్రపంచ వ్యాప్తముగా అసంఖ్యాకమైన స్వతంత్ర సంఘములు బైబులును ధ్యానించి, అందలి బోధను అంగీకరించిరి.

క్రిస్టడెల్ఫియన్ల నమ్మకములు మరియు ఆచరణములు, క్రొత్త నిబంధన గ్రంథములోను, మొదటి మరియు రెండవ శతాబ్దపు ఆదిమ క్రైస్తవ రచనలలోను అనగా క్లెమెంతుకు వ్రాసిన పత్రిక (The Epistle of Clement) దిదకి (The

Didache ) మరియు అపొస్తలుల సిద్ధాంతములలోను (The Apostles' Creed ) కనబడును.

పదహారవ శతాబ్దములో ఐరోపాలో మతస్వాతంత్రము మొదలయినప్పుడు, బైబులు బోధనను అనుసరించు సంఘములలో అవే నమ్మకములు మరియు ఆచరణములు తిరిగి అమలులోనికి వచ్చినవి. ఆ సంఘములు ఏవనగా శిశు బాప్తిస్మము పొందియూ పెద్దలైన తరువాత మరలా బాప్తిస్మము పొందువారు (Swiss Anabaptists ) మరియు త్రిత్వ సిద్ధాంతమును మరియు క్రీస్తు యొక్క దైవత్వమును తృణీకరించువారు(Polish Socinians ).

ఆదిమ ఆంగ్ల బాప్తిస్టులు అను సంఘము వారును ఈ విధమైన నమ్మకములనే కలిగియున్నారు. (ఈనాటి బాప్తిస్టు సంఘమువారు ఈ నమ్మకములు కలిగిలేరు). పద్దెనిమిదవ శతాబ్దపు ప్రముఖులలో సర్ ఐజక్ న్యూటన్ (Sir Isaac Newton ) మరియు విలియమ్ విస్టన్ (William Whiston ) అనువారును ఈ నమ్మకములనే కలిగియుండిరి.

ఆధునిక క్రిస్టడెల్ఫియన్ ఉద్యమము 1830లో ప్రారంభమైనది. అమెరికా మరియు ఇంగ్లాండు దేశములలో ఈ ఉద్యమముద్వారా ఆ నమ్మకములనే తిరిగి అమలులోనికి తేబడి పునఃస్థాపనచేయబడెను. అమెరికాలోని ఒక వైద్యుడైన జాన్ థామస్ (John Thomas ) రాజ్య చాటింపు (The Herald of the Kingdom ) అను పత్రికను ప్రచురించెను. ఈ పత్రికయందు పునరుత్థానము మరియు దేవుని రాజ్యమునుగూర్చిన బైబులు బోధనలు, తెలియజేయబడెను. బ్రిటన్‌లోని ఒక విలేఖరుడైన రాబర్ట్ రాబర్ట్స్ (Robert Roberts ) కూడ ఈ విషయములను రాబోవు యుగపు రాయబారి (Ambassador of the Coming Age ) అను పత్రికలో వ్రాసెను. ఈ గ్రంథకర్తలైన జాన్ థామస్ మరియు రాబర్ట్ రాబర్ట్స్ ఇరువురును వారి సొంత ప్రకటనలు వ్రాయలేదు కాని యథార్థముగా బైబులులో వ్రాయబడినదే విశ్వసించిరి.

1861వ సంవత్సరములో అమెరికాలో యుద్ధము (American Civil war )

సంభవించినప్పుడు ఆ యుద్ధములో పాల్గొనని క్రైస్తవ సంఘములు ప్రభుత్వ కార్యాలయములలో వారి పేరు నమోదుచేసుకొనవలసివచ్చెను. ఆ సమయమున సామ్ కాఫ్మన్ (Sam Coffman),మరియు ఇలనాయిస్ (అమెరికా) నుండి కొందరు సహోదరులు తమ్మును తాము క్రీస్తు నందు సహోదరులు అనగా "క్రిస్టడెల్ఫియన్స్" అని నమోదుచేసిరి. ఇటువంటి నమ్మకములుగల అనేక విశ్వాసులు (అమెరికా మరియు బ్రిటన్), ఈ పేరుతో పిలువబడుటకు ఇష్టపడిరి. అప్పటినుండి ప్రపంచ వ్యాప్తముగా స్వతంత్ర క్రిస్టడెల్ఫియన్ సంఘములు ఉద్భవించినవి.

ఈ కరపత్రముయొక్క తరువాయి భాగములో క్రింద ఇయ్యబడిన విషయములనుగూర్చి వ్రాయబడినది:

1. మా నమ్మకములు
2. మా జీవిత విధానము
3. మా సహవాసము, ఆరాధన మరియు సాక్షము.

# 1. మా నమ్మకములు
## Our Beliefs

### బైబులు
**The Bible**

బైబులు మాత్రమే మానవాళికి దేవుడిచ్చు వర్తమానమని మా విశ్వాసము. మనుష్యులకు, దేవునియందును ఆయన కుమారుని యందును విశ్వాసములోనికి నడుపుటకు ఇవ్వబడిన వర్తమానము. బైబులు మాత్రమే అధికారముగలదైనందున అవకాశము లభించిన ప్రతిసారి ప్రార్థనాపూర్వకముగా చదువవలెను.

(2తిమోతి 3:16-17; 1పేతురు 1:10-12; 2పేతురు 1:20-21; అపొ.కా. 17:11; ఎఫెసీ 2:20; రోమా 16:26).

## దేవుడు

**God**

నిత్యుడును, అమర్త్యుడైన దేవుడు ఒక్కడే. యేసు క్రీస్తు, దేవుని అద్వితీయ కుమారుడు మరియు పరిశుద్ధాత్మ దేవుని శక్తియైయున్నది.
(ద్వితీ.కా. 6:4; లూకా 1:35; అపొ.కా. 1:8; 1కొరింథీ 8:6; 1తిమోతి 1:17; 2:5; 6:16).

## నరుడు

**Man**

నరుడు దేవునియెదుట మర్త్యుడుగాను, పాపిగాను ఉన్నాడు. అతడు పాపమునకు లోనగు స్వభావముగలవాడు మరియు పాపములకు విధింపబడు శిక్ష మరణము అనగా జీవమంతటికి అంతము.

(యిర్మీయా 17:9; మార్కు 7:21-23; రోమా 3:23; యాకోబు 1:13-15; రోమా 6:23; ప్రసంగి 9:5, 10; కీర్తనలు 115:17; 146:4).

## నిరీక్షణ

**Hope**

జీవితమునకుగల ఏకైక నిరీక్షణ మరణము తరువాత శరీరముయొక్క పునరుత్థానము మరియు భూమిపై స్థాపింపబడు దేవుని రాజ్యములో నిత్యజీవితము.

(కీర్తనలు 49:12-20; యోహాను 11:25-26; అపొ.కా. 24:15; రోమా

8:22-39; 1కొరింథీ 15:12; ప్రకటన 5:10; 20:4).

## వాగ్దానములు

**The Promises**

పాత నిబంధన గ్రంథములో దేవుడు అబ్రాహాముకు, దావీదుకుచేసిన వాగ్దానములు సువార్తలనుండి వేరుపరచలేము. ఏలయనగా ఈ వాగ్దానములు యేసు క్రీస్తునందు నెరవేరెను.

(అపో.కా. 13:32; ఆది.కా. 13:14-17; 22:15-18; 2సమూ. 7:12,16; లూకా 1:31-33; గలతీ 3:6-9, 16, 26-29).

## దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను...

**God so Loved the World...**

దేవుడు తన ప్రేమను బట్టి నరుని, వాని పాపములనుండి రక్షించుటకు తన కుమారుని లోకములోనికి పంపెను, ఆయనే నరుడైన యేసు. ఆయనయందు విశ్వాసముంచు ప్రతి వాడును నశింపక, నిత్యజీవమును పొందుదురు.

(మత్తయి 1:20-21; 3:17; లూకా 1:35; యోహాను 3:16).

## క్రీస్తుయొక్క బలియాగము

**The Sacrifice of Christ**

యేసు పాపములేనివానిగా నుండెను. దేవునియొక్క నీతిని బయలుపరచుటకును, విశ్వాసముతో ఈ బలియాగమును స్వీకరించు వారిని విమోచించుటకును యేసు మరణించెను. దేవుడు, యేసును మరణమునుండి పునరుత్థానునిచేసి, అమర్త్యునిగా చేసి, భూమ్యాకాశములమీద సమస్త అధికారమును

ఇచ్చి) మరియు దేవునికిని నరునికిని మధ్యవర్తిగా నియమించెను.
(రోమా 3:21-26; ఎఫెస్సీ 1:19-23; 1తిమోతి 2:5-6; హెబ్రీ 4:14-16).

## యేసు తిరిగి వచ్చుట

**The Return of Jesus**

యేసు అతి త్వరలో భూమికి తిరిగి రానైయున్నాడు. మృతులలో అనేకులను ఆయన లేపును. సజీవులైన వారితో కలిపి తీర్పుతీర్చును మరియు విశ్వాసులకు దేవుని రాజ్యములో నిత్యజీవమునిచ్చును.

(దానియేలు 12:2; మత్తయి 25:31-34; లూకా 21:20-32; యోహాను 5:28-29; అపొ.కా. 1:11; 2తిమోతి 4:1; ప్రకటన 22:12).

## దేవుని రాజ్యము

**The Kingdom of God**

దేవుని రాజ్యము భూమిమీద స్థాపింపబడును. యెరూషలేములో యేసు రాజుగానుండును. ఆయన రాజ్యము భూదిగంతములూ వ్యాపించును. ఆయన ప్రభుత్వము నిత్య నీతిని మరియు సమాధానమును తెచ్చును.

(కీర్తనలు 72; యెషయా 2:2-4; 9:6-7; 11:1-9; 61:1-11; యిర్మీయా 3:17; దానియేలు 2:44; 7:14, 27; అపొ.కా. 3:21).

## రక్షణ మార్గము

**The Way of Salvation**

విశ్వాసము ద్వారానే దేవుని రాజ్యమును చేరగలము అనగా బైబులును నమ్మి

అందలి విషయములకు విధేయులైయుండుట. మరియు స్త్రీ, పురుషులు, వారి వారి పాపములను ఒప్పుకొని, పశ్చాత్తాపమునొంది, బాప్తిస్మముపొంది, విశ్వాసముతో యేసును వెంబడింపవలెను.

(మత్తయి 16:24-27; మార్కు 16:16; యోహాను 3:3-5; అపొ.కా. 2:37-38; 4:12; 2తిమోతి 3:15; హెబ్రీ 11:6).

## కొన్ని ముఖ్యమైన వ్యత్యాసములు

**Some Important Differences**

ఇతర క్రైస్తవ సమూహములనుండి క్రిస్టడెల్ఫియన్లు ఏవిధమైన వ్యత్యాసములు కలిగియున్నారని అనేకులు అడుగుదురు. పైన చెప్పబడిన మా నమ్మకములేకాక మరికొన్ని సిద్ధాంతములు మాకున్నవి.

యేసు యొక్క మరణము మరియు పునరుత్థానము తరువాత సంఘములోని (క్రీ.శ. 325, నిసియా సభ) భేదాభిప్రాయముల కారణముగా ఉద్భవించిన త్రిత్వ సిద్ధాంతమును మేము తిరస్కరింతుము. బైబులు యేసును, దేవుని కుమారునిగా బోధించుచున్నది, కాని దేవుడైన కుమారుడు, క్రీస్తు జననమునకు ముందే పరలోకమందు ఉన్నాడని బోధించుటలేదు.

క్రీస్తు పరిచర్యను, ఆయన మనుష్యత్వమును, ఆయన మరణముయొక్క వాస్తవత్వమును త్రిత్వ సిద్ధాంతము వ్యతిరేకించుచున్నది. క్రీస్తు దేవుడైనయెడల ఆయనకు శోధనలు కలుగవు మరియు మరణము సంభవింపనేరదు.

(1తిమోతి 2:5; 1కొరింథీ 11:3; హెబ్రీ. 5:8).

మరణము తరువాత పరమునకు ఎక్కిపోవు అమరత్వముగల ఆత్మనుగూర్చిన అభిప్రాయము బహుగా ప్రాచుర్యములోనున్నది కాని క్రిస్టడెల్ఫియనులు ఈ

అభిప్రాయమును విశ్వసించరు. నిత్యజీవమునకు మనకున్న ఏకైక నిరీక్షణ ఏమనగా క్రీస్తుని రాకడయందు మృతుల పునరుత్థానము మరియు ఆయనతో దేవుని రాజ్యములో జీవించుటకు అవకాశము.
(యోహాను 3:13; అపో.కా. 2:34; 1థెస్సలొ. 4:16).

బాప్తిస్మము అత్యవసరమైనదని మా విశ్వాసము మరియు బాప్తిస్మము పెద్దలకొరకు మాత్రమే కాని పిల్లలపై నీళ్లు చిలకరించుట బాప్తిస్మము కాదు అని మా నమ్మకము.

(యోహాను 3:5; కొలస్సె 2:12; 1పేతురు 3:21).

పాపపూరితమైన, మానవ స్వభావమునుగూర్చి 'దయ్యము' అని బైబులునందు వ్రాయబడినదని మేము నమ్ముదుము. కనుకనే ప్రకృతి బాహ్యమైన శక్తిగల శోధకునిగూర్చిన సిద్ధాంతమునకు మేము వ్యతిరేకులము. (యెషయా 45:7; మార్కు 8:33; యోహాను 6:70; హెబ్రీ 1:14).

# 2. మా జీవిత విధానము

## Our Way of Life

### బైబులు - జీవితమునకు మార్గదర్శియైన పుస్తకము

**The Bible - Guidebook for Life**

బైబులు అధికారము గలది గనుక, దానిపై మాత్రమే మన జీవితములు ఆధారపడి ఉండవలెను. క్రిస్టడెల్ఫియనులలో బహుగా వాడుకలో ఉన్న ఒక అలవాటు ఏమనగా బైబులు పఠన ప్రణాళిక ప్రకారము బైబులు ప్రతి దినము చదువుట.

ఆ విధముగా చదువుటద్వారా ఒక్క సంవత్సరములో పాత నిబంధన గ్రంథము ఒక్కమారు మరియు క్రొత్త నిబంధన గ్రంథము రెండు మార్లు చదువుట సాధ్యపడును. అనేకులు ఇంతకు మించి చదువుదురు.
(రోమా 15:4; 1థెస్సలొ 2:13; యాకోబు 1:22; 2తిమోతి 2:15).

## ప్రార్థన

**Prayer**

క్రొత్త నిబంధన గ్రంథములోని ఉదాహరణను అనుసరించుచు మరియు క్రీస్తుని సూచనల ప్రకారము, మనము దేవునికి అనగా పరమందున్న తండ్రికి, కుమారుని నామములో అనగా యేసు క్రీస్తుని నామములో ప్రార్థింతుము. కాని యేసుకు మాత్రమే ప్రార్థించము. అయినను మన బలహీనతలన్నియు ఎరిగిన క్రీస్తునితో వ్యక్తిగత సంబంధము కలిగియుండుటలో దేవునికి చేయబడు ఈ ప్రార్థన అడ్డంకు కానేరదు. (యోహాను 15:16; 16:26; హెబ్రీ 2:15).

## పని (వృత్తి)

**Work**

అపొస్తలుడైన పౌలుయొక్క ఉదాహరణ ప్రకారము మరియు పౌలు బోధనల ప్రకారము క్రిస్టడెల్ఫియన్లు తమ కుటుంబములను పోషించుటకు న్యాయమైన వృత్తిని చేపట్టుదురు. కొన్ని వృత్తులు (రాజకీయము, సైన్యము, రక్షణదళము, నేరస్థాపనాచట్టము) చేపట్టుట క్రిస్టడెల్ఫియనులలో నిషిద్ధము.(1తిమోతి 5:8; 2 థెస్సలొ. 3:6-12).

## కుటుంబ జీవితము

**Family Life**

భార్య భర్తల మధ్య సంబంధము, క్రీస్తు మరియు సంఘముయొక్క సంబంధముతో పోల్చబడినది. వివాహమనునది అతిపవిత్రముగా ఎంచబడవలెను. పిల్లలను దేవునిగూర్చిన జ్ఞానములో అభివృద్ధిపరచవలెను. పిల్లలను సండేస్కూలుకు పంపుటద్వారా మరియు పెద్దలతో కలిసి అనుదిన బైబులు పఠనములో పాల్గొనుటద్వారా దేవునిగూర్చిన జ్ఞానమునందు అభివృద్ధి పొందుదురు, సంఘములోని పెద్దలను వారి కుటుంబములు మరియు సంఘమును ఆదరించవలెను. (ఎఫెస్సీ 5:22-33; 6:4; 1తిమోతి 5:4).

## సహాయము

**Giving**

క్రిస్టడెల్ఫియన్లు వ్యక్తిగతముగాను సమూహముగాను, దాతృత్వపుకార్యములలో బహు ఉదారముగానుందురు. మనుష్యులు చూచునట్లు చేయక జాగ్రత్తపడుదురు. ప్రజలు తప్పుడు ఉద్దేశ్యములతో క్రీస్తునొద్దకు వచ్చుటను నివారించుటకు క్రిస్టడెల్ఫియన్లు దాతృత్వమునకును, బోధను విడివిడిగా వ్యవహరింతురు. (గలతీ 6:10; యాకోబు 1:27; 2:15-16; మత్తయి 6:1-4; యోహాను 6:26).

సంపాదనలోని దశమభాగమును సంఘమునకు ఇచ్చుటను మేము నమ్మము. ఏలయనగా దశమభాగము, పాతనిబంధన కాలములో యాజకులైన లేవీయులను పోషించుటకు ఇవ్వబడినది. ఇప్పుడు ఆ పద్ధతి నిషేధింపబడినది. (సంఖ్యా.కా. 18:24; హెబ్రీ. 7:1-28).

## శరీరము మరియు ఆత్మ

**Flesh and Spirit**

బాప్తిస్మము తరువాత మన జీవిత విధానమును మార్చుకొని, శరీరానుసారముగా కాక ఆత్మానుసారముగా జీవించవలెను. అయినను ఆత్మానుసారముగా అనిన అసాధారణ శక్తిగల ఆత్మ అనియు శరీరానుసారముగా అనిన దయ్యము అనియు అర్థముకాదు. దేవుడు మన జీవితములలో తన వాక్యముద్వారా, తన రక్షణద్వారా చురుకుగా పనిచేయుచున్నాడు. (రోమా 6:1-4; మార్కు 14:38; గలతీ 5:22-25).

## విశ్వాసము మరియు కృప

**Faith and Grace**

మేము, దేవునిపై పూర్తిగా ఆధారపడి, ఎడతెగక ప్రార్థించుటతోను, మంచి కార్యములతోను విశ్వాసమును ధృఢపరచుకొందుము. అయినను రక్షణ అనునది కేవలము దేవుని ఉచిత కృపవలననే కలుగుచున్నదని మా విశ్వాసము. (ఎఫెసీ 2:8).

దేవుని సహాయమువలననే ఆయనకు అనుదినము విధేయులుగా నుండుటకును, తండ్రికి విశ్వాసముతో విధేయుడైన క్రీస్తును, వెంబడించుటకును, ప్రయత్నింతుము. కనుక మేము పనిలో ఆసక్తికలిగి, వివాహము పట్ల నమ్మకముకలిగి, ఇచ్చుటలో దాతృత్వము కలిగియుండుటకు పాటుపడుదుము.

# 3. మా సహవాసము, ఆరాధన మరియు సాక్ష్యము

# Our Fellowship, Worship and Witness

## కూటములు

**Meetings**

వారమునకు ఒక్క మారు, దేవుని ఆరాధించుటకు మరియు ఆయన కుమారుడైన యేసు చేసిన త్యాగమును జ్ఞాపకముచేసుకొనుచు రొట్టె ద్రాక్షారసము తీసుకొనుటకు కూడుకొందుము. బాప్తిస్మముపొందిన సభ్యులందరు రొట్టెద్రాక్షారసము తీసుకొనుటలో భాగస్తులగుదురు. (1కొరింథీ 11:23-26; 12:13; మత్తయి 26:26-30).

ఆరాధనలో రొట్టె, ద్రాక్షారసము పుచ్చుకొనుటయే కాక ప్రార్థించుట, బైబులు నుండి రెండు లేక మూడు అధ్యాయములు చదువుట, అనేక కీర్తనలు పాడుట మరియు బైబులుపై ఆధారితమైన ఒక్క ప్రసంగము (ప్రోత్సాహకరమైన సందేశము) మొదలగునవి కూడ ఉండును. ప్రతి వారము వేరు వేరు సహోదరులు ప్రసంగింతురు. (ఎఫెసీ 5:19; 1తిమోతి 4:13; హెబ్రీ 3:13).

ఆరాధన సమావేశములో పాల్గొనుట అనునది మన ఆధ్యాత్మిక జీవితమును ధృఢపరచును. అనేక దేశములలో ఈ ఆరాధన ప్రతి ఆదివారము, జరుగును కాని వారములో ఏ రోజునైనా ఆరాధన జరుపుకొనవచ్చును. (ఉదాహరణకు నేపాల్‌లో శనివారము జరుగును, మరియు బంగ్లాదేశ్‌లో శుక్రవారము ఆరాధన జరుగును) ఏలయనగా అక్కడ ఆదివారము సెలవు దినముకాదు. పిల్లలు సండేస్కూలునందు బైబులుగూర్చి నేర్చుకొనెదరు. (అపొ.కా. 2:42, 20:7; 1కొరింథీ 16:2).

స్థానిక సంఘస్థులు, వారములో ఒకటి లేక అంతకంటే ఎక్కువ సాయంత్రములు కూడుకొని బైబులు తరగతులు జరుపుకొందురు. అంతేకాక యవ్వనస్తులకు కొన్ని కార్యక్రమములు నిర్వహింతురు.

## బైబులు వారోత్సవములు

**Bible Schools**

క్రిస్టడెల్ఫియనులకు వేద పాఠశాలలు కాని బడులు కాని ఉండవు. ప్రతి సంవత్సరము క్రిస్టడెల్ఫియన్ సభ్యులందరు ఒక వారము లేక కొన్ని వారాంతములు, బైబులు తరగతులలో లేక బైబులు అభ్యాస కూటములలో పాల్గొందురు. ఈ కూటము, విద్యాసంస్థలను కాని ఇతర చర్చిలను కాని అద్దెకు తీసుకొని, అక్కడ ఏర్పరచబడును.

ఈ కూటములలో ఇద్దరు లేక ముగ్గురు ప్రసంగీకులు ఉందురు, ఒక్కొక్క ప్రసంగీకుడు బైబులునుండి వేరు వేరు పుస్తకములను అంశములను ఎన్నుకొని దాని విషయమై ప్రసంగింతురు.

## కార్యనిర్వాహణ

**Organisation**

ప్రతి ఎక్లీషియ (సంఘము) వారును స్వనిర్వాహకులైయుందురు. జాతీయ లేక అంతర్జాతీయ నాయకత్వము కాని కేంద్రీయ కార్యలయములు కాని ఉండవు. అయినను ఒకే విశ్వాసము మీద ఆధారపడి ప్రపంచ వ్యాప్తముగా క్రిస్టడెల్ఫియన్లు మంచి సహవాసము కలిగియుందురు. ఇతర సంఘములవలే కాక మా కూడికలలో కుటుంబ వాతావరణము గోచరించును. ఇది క్రొత్త నిబంధన నమూనా. (ఎఫెసీ 3:15; 4:1-6; 1యోహాను 1:6-7).

ఆదిమ యెరూషలేము సంఘములో పన్నెండుగురు పెద్దలు, వాక్యపరిచర్య (బోధించుట)కు బాధ్యులు మరియు ఏడుగురు పరిచారకులు సంఘపరిచర్యకు

(సంఘముయొక్క సంరక్షణా బాధ్యతలు) బాధ్యులు. అదేవిధముగా ఎఫెస్సులోని సంఘములో అనేక నిర్వాహణా అధ్యక్షులు (బిషప్పులు) అనగా పెద్దలు ఉండిరి. ఈ వ్యవస్తనుబట్టి వేతనములు చెల్లింపబడు ఒక్క పాదిరి యుండుట యుక్తము కాదని మనకు తెలియుచున్నది. (మత్తయి 23:8-11; అపొ.కా. 1:23-26; 6:1-6; 20:28).

## బోధన

### Preaching

ప్రతి ఎక్లీషియ (సంఘము) రాజ్యమును గూర్చిన సత్యసువార్తను మరియు యేసు క్రీస్తుయొక్క నామమును వారి వారి స్థానిక ప్రదేశములలో బోధించును. (అపొ.కా. 8:12; 28:31; 2తిమోతి 4:2).

కొందరు, సభ్యులు, దేశాంతరములు ప్రయాణించి స్థానిక, సహోదర సహోదరీలకు బోధనా పరిచర్యలో సహాయపడుదురు. ఈ సభ్యులు కూడ ప్రసంగీకులైన సహోదరులవలే స్వచ్ఛందముగా (వేతనములు చెల్లింపబడకయే) పనిచేతురు. (అపొ.కా. 20:33-34; 1థెస్సలొ. 2:9)

క్రిస్టడెల్ఫియన్లు అనేక దేశములలో బైబులు అభ్యాస కూటములు నిర్వహించుటయే కాక, బైబులు ఆధారితమైన పుస్తకములు మరియు కరపత్రములు ఉచితముగా పంచిపెట్టుదురు. మా గురి, ఏమనగా, పౌలువలె ఉచితముగా సువార్తను ప్రకటించుట. (1కొరింథీ 9:18).

## ఆహ్వానము

### An Invitation

సాయశక్తులా దేవుని సేవలో పాల్గొను ఐక్యభావములుగల సంఘమే, ఈ క్రిస్టడెల్ఫియన్లు. మరికొన్ని విషయములు తెలుసుకొనగోరినయెడల ఈ కరపత్రము వెనుక ఇయ్యబడిన చిరునామాకు వ్రాయగలరు.

ఈ చిన్న పుస్తకములో ప్రపంచవ్యాప్తమైన క్రిష్టడెల్ఫియన్ సహోదరత్వముగూర్చి గ్రంథకర్త – రాబ్ హైన్డ్‌మెన్ పరిచయము చేయుచున్నారు. ప్రతి భాగములోను బైబులు లేఖన భాగములు తెలియజేయబడినవి. దయచేసి ఆ లేఖనములను మీ బైబులునుండి చూడగలరు.

ఈ పుస్తకములోని భాగములు:

1. మా నమ్మకములు
2. మా జీవిత విధానము
3. మా సహవాసము, ఆరాధన మరియు సాక్ష్యము

ఉచిత పుస్తకములకొరకు దిగువ చిరునామాకు వ్రాయండి:

# ఉచిత బైబులు మాసపత్రిక

# బైబులు కరెస్పాండెన్స్ కోర్సు


క్రిస్టడెల్ఫియన్స్
జి.పి.ఒ. బాక్స్ 159,
హైదరాబాదు ఆ.ప్ర. 500 001